క్లుప్తంగా

రాజ్‌భవన్ ముట్టడిని జయప్రదం చేయాలి

నిజామాబాద్‌అర్బన్: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విద్యార్థులు భారీగా పాల్గొని, జయప్రదం చేయాలని ప్రధాన కార్యదర్శి గణేష్ అన్నారు. నగరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు కోదండరాం రాక

నిజామాబాద్‌అర్బన్: నేడు జిల్లాకు ప్రొఫెసర్ కోదండరాం రానున్నట్లు తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో సోమవారం తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొంటారన్నారు.

కాసర్లకు రాష్ట్రస్థాయి పురస్కారం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్‌పూర్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, కవి కాసర్ల నరేశ్‌రావు రాష్ట్రస్థాయి బాలసాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. సిద్దిపేటలో ఆదివారం శ్రీవాణి సాహిత్య పరిషత్తు, పెందోట బాల సాహిత్యపీఠం వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలసాహిత్య పురస్కారాల సభ నిర్వహించి, అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. కాసర్ల రచించిన బడి పిల్లల నాటికల సంపుటి 'జై విజ్ఞాన్' పుస్తకానికి ఈ పురస్కారంను సంస్థ అధ్యక్షుడు పెందోట వేంకటేశ్వర్లు అందజేశారు. కవులు దాశరథుల బాలయ్య, ఐతా చంద్రయ్య, కొండల్‌రెడ్డి, వాసర వేణి, పరుషురాములు, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీలు



సిరికొండ: మండలంలోని మైలారం గ్రామంలో డ్రెయినేజీలు అపరిశుభ్రంగా మారాయి. మురికి కాలువలను పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయకపోవడంతో చెత్తతో పేరుకుపోయాయి. చిన్నపాటి వర్షానికే మురికినీరు రోడ్లపై పారుతున్నాయి. అంబేడ్కర్ కాలనీలో మురికినీరు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో సమస్యను విన్నవించినా, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌కు వినతిపత్రం అందించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అటవీ ప్రాంతంలో సీడ్ బాల్స్



వర్ని(మోస్రా): మోస్రా అటవీ ప్రాంతంలో సిరివెన్నెల గ్రీన్ సొసైటీ నిజామాబాద్, లయన్స్ క్లబ్ మోస్ర ఆధ్వర్యంలో విత్తన బంతులను ఆదివారం చల్లారు. అటవీ ప్రాంతంలో జంతువులకు ఆహారం, పర్యావరణ పరిరక్షణకు అటవీ ప్రాంతంలో పండ్ల విత్తనాలను చల్లినట్లు సొసైటీ వ్యవస్థాపకుడు జనార్దన్ వెల్లడించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వినయ్, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీకాంత్, త్రినాథ్ గౌడ్, వరప్రసాద్, రవి, రాజేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో 24 గంటల సేవలందించాలి

రుద్రూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని మైనారిటీ హక్కుల పోరాట సమితి సభ్యుడు ఇర్ఫాన్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాత్రి వేళ తీవ్ర అనారోగ్య పరిస్థితులు ఎదురైతే బోధన్ పట్టణానికి వెళ్లాల్సి వస్తోందని అన్నారు. మండలంలో ఆర్ఎంపీ, పీఎంపీలు తప్పా ఒక్కరు కూడా ఎంబీబీఎస్ వైద్యుడు లేరని దీంతో ఆటో కిరాయి రూ. ఐదు వందల వరకు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో పాటు సకాలంలో వైద్యసేవలు పొందలేకపోతున్నారని వాపోయారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి రుద్రూర్‌లో 24 గంటల వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు.

వెంచర్లలో పార్కు స్థలాలేవి?

- నిబంధనల ప్రకారం 10శాతం స్థలం ఇవ్వాల్సిందే
- పర్యవేక్షించని అధికారులు



నగరంలోని గిరిరాజ్ కళాశాల ప్రాంతంలో పార్కు స్థలంలో తొలగించిన హద్దు రాళ్లు

నిజామాబాద్‌నాగారం: వెంచర్లు ఏర్పాటు చేస్తే కచ్చితంగా పార్కు స్థలాలు ఉండాల్సిందే.. ఎన్ని ఎకరాల వెంచర్ వేసినా 10శాతం భూమిని పార్కు స్థలానికి కేటాయించాలి. అయితే కొంతమంది వెంచర్ యాజమాన్యాలు పార్కుస్థలాల విషయంలో కక్కుర్తి పడి బైనంబర్‌లు వేసి అమ్ముకుంటున్నారు. మున్సిపల్ నగరంలో ఇలాంటివి కోకోల్లాలుగా ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో పార్కు స్థలాల్లో ఉన్న హద్దు రాళ్ల తొలగించి కొంతమంది కబ్జాకు పాల్పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు ఎవరికి వారు చోద్యం చూస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

నిజామాబాద్ నగరంలో 60 డివిజన్లలో వందల సంఖ్యలో వందలాది ఎకరాల్లో వెంచర్లు ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడిగా అక్రమంగా నాన్‌లేవుట్ వెంచర్లు ఏర్పాటు చేశారు. అయితే వెంచర్లలో కచ్చితంగా 10శాతం భూమిని పార్కు స్థలానికి కేటాయించాలి. ఇందులో పార్కు, కమ్యూనిటీ భవనం, గుడి, బడి, వాటర్ ట్యాంకు తదితర వాటిని నిర్మించుకోవాలి. అయితే వెంచర్లు వేసే యాజమాన్యాలు భూముల ధరలు గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతుండడంతో అత్యాశకు పోయి పార్కు స్థలాలకు బై నంబర్‌లు వేసి అమ్మేస్తున్నారు. తద్వారా వెంచర్లలో పార్కు స్థలం మాయం అవుతుంది. నాన్ లేఅవుట్ వెంచర్లలో 10శాతం భూమి చూపించాల్సిన యాజమాన్యాలు కాగితాల్లో మాత్రం చూపిస్తున్నారు. వెంచర్లలో మాత్రం భూమి ఉండదు. నిర్మాణాలు జరుగుతునే ఉన్నాయి.

కబ్జాపై ఫిర్యాదు!

ఇటీవల నగరంలోని గిరిరాజ్ కళాశాల ప్రాంతంలో పార్కు స్థలం కబ్జాకు గురైంది. సర్వేనంబర్ 125, 126లో ఏర్పాటు చేసిన వెంచర్‌కు చెందిన పార్కు స్థలంలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా హద్దురాళ్లను పాతారు. ఈ విషయమైన స్థానికులు మున్సిపల్ కమిషనర్ మకరందుకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పార్కు స్థలంలో అక్రమంగా హద్దు రాళ్ల ఏర్పాటు చేశారని, వెంటనే అధికారులు తొలగించాలని కోరారు. కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వెంచర్లలో 10శాతం పార్కు భూమి కబ్జాకు గురవుతునే ఉంది. సంబంధిత అధికారులు తమకే పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అక్రమార్కులు పార్కు స్థలాలు కబ్జా చేసి అందిన కాడికి దండుకునే పనిలో నిమగ్నమయ్యారు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కాస్త దృష్టి పెడితే వెంచర్లలో 10శాతం భూమికి రక్షణ ఏర్పడుతుందని పలువురు కోరుతున్నారు.

డీఎస్ అంతిమయాత్రలో ఉద్యోగ సంఘాల నేతలు

సుభాష్‌నగర్: నగరంలో ఆదివారం నిర్వహించిన మాజీ మంత్రి, పీసీసీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు డి శ్రీనివాస్ అంతిమయాత్రకు రెవెన్యూ, టీఎన్‌జీవో సంఘాల నాయకులు హాజరయ్యారు. అదేవిధంగా అంతిమ యాత్రకు విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు డీఎస్ పార్థివ దేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, నివాళ్లు అర్పించారు. రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, అసోసియేట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, టీఎన్‌జీవో, టీజీవో అధ్యక్షుడు అలుక కిషన్, సంగం అమృత్‌కుమార్, ప్రధానకార్యదర్శి నేతికుంట శేఖర్, నాయకులు చిట్టి నారాయణరెడ్డి, పోల శ్రీనివాస్, జాకీర్ హుస్సేన్, సత్యం, రాజశేఖర్, ఉమా కిరణ్, క్లాస్–4, డ్రైవర్ అసోసియేషన్‌పాల్గొన్నారు.

500 మంది పోలీసులతో భారీ బందోబస్తు

డీఎస్ నివాళ్లు అర్పించడానికి సీఎం రేవంత్‌రెడ్డి రావడంతో 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రగతి నగర్ నుంచి కొత్తకలెక్టరేట్ నుంచి డీఎస్ వ్యవసాయక్షేత్రం వరకు పోలీసులను పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. బందోబస్తులో ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.



అంతిమయాత్రలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



సీఎం రేవంత్‌రెడ్డితో ట్రెసా, టీఎన్‌జీవోస్ నాయకులు



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఘనంగా బోనాల పండుగ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) ఐదో డివిజన్‌లో ఆదివారం ఆరెల్లి మైసమ్మ పండుగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులందరూ అన్ని కులాలు ఇంటికో బోనంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయానికి తీసుకెళ్లి ఆరెల్లి మైసమ్మకు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, పాడి, పశువులు వృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. వీడీసీ సభ్యులు ఈగ శేఖర్‌రెడ్డి, చామకూర భాస్కర్‌రెడ్డి, రచ్చ శ్రీనివాస్, బత్తుల రాంచందర్, గుత్ప దశరథ్ పాల్గొన్నారు.



డిచ్‌పల్లి ఖిల్లా జెడ్పీహెచ్‌ఎస్ 2011-2012 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం 2011–2012కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు పదేళ్ల తర్వాత విద్యార్థులందరూ ఒకేచోట కలవడంతో సంతోషంగా పలుకరించుకున్నారు. ఆనాటి తీపిగుర్తులను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

పదెకరాలలోపు వారికే రైతుభరోసా ఇవ్వాలి

- గుట్టలు, బీడు భూములకు ఇవ్వొద్దు
- మహాజన సభల్లో రైతుల అభిప్రాయం



రామడుగులో మాట్లాడుతున్న డీఏవో వాజిద్ హుస్సేన్..



రాంపూర్‌లో మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాసరావు

డిచ్‌పల్లి/సిరికొండ/ధర్పల్లి/ఇందల్వాయి : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా సాయాన్ని ఒకే కుటుంబానికి గరిష్ఠంగా పది ఎకరాల్లోపు పరిమితం చేయాలని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా గుట్టలు, బీడు భూములకు కాకుండా నిజంగా పంటలు పండే భూములకు వర్తింపచేయాలన్నారు. రైతు భరోసా పథకం అమలుపై సలహాలు, సూచనల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక అధికారులు రూరల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో రైతులతో ప్రత్యేక మహాజన సభలు నిర్వహించారు. డిచ్‌పల్లి మండలం రాంపూర్ సొసైటీలో చైర్మన్ తారాచంద్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీసీవో శ్రీనివాసరావు హాజరై రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. సిరికొండలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్ గంగాధర్, వైస్ చైర్మన్ నర్సయ్య, అధికారులు రైతుల అభిప్రాయాలు సేకరించారు.ధర్పల్లి మండలంలోని ధర్పల్లి, రామడుగు, హొన్నాజిపెట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిర్వహించిన సభల్లో డీఏవో వాజిద్ హుస్సేన్, సొసైటీ చైర్మన్‌లు చిన్నారెడ్డి, జనార్దన్ , వైస్ చైర్మన్ మామిడి రాములు అభిప్రాయాలను సేకరించారు. అలాగే ఇందల్వాయి, నల్లవెల్లి సొసైటీల్లోనూ డీఏవో పాల్గొని, రైతుల అభిప్రాయాలు సేకరించారు. పది ఎకరాల లోపు ఉన్న వారికే రైతు భరోసా వర్తింప జేయాలని మెజార్టీ రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. నాలా భూములు, చెరువులు, సాగులో లేని భూములకు రైతు భరోసా అవసరం లేదని తెలిపారు. ప్రతి సీజన్‌లో జూన్ 10 లోపు, నవంబర్ 15 లోపు రైతు భరోసా అందించాలని రైతులు కోరారు. సన్న, చిన్న కారు రైతులకే పథకాన్ని అమలు చేయాలని పలువురు రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈనెల 29 నుంచి జిల్లా వ్యాప్తంగా మహాజన సభల్లో రైతుల నుంచి సలహాలు సూచనలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని డీఏవో వాజిద్ హుస్సేన్ తెలిపారు.



హొన్నాజీపేట్‌లో..



సిరికొండలో..



నల్లవెల్లిలో..

భూమి కబ్జా కాకుండా కాపాడాలి

ఇందల్‌వాయి: మండలంలోని గౌరారం గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం కేటాయించిన భూమి కబ్జాకు గురికాకుండా కాపాడాలని గ్రామస్తులు ఒక ప్రకటనలో కోరుతున్నారు. సర్వే నెంబర్ 180లో మూడెడ్ల తులసమ్మకు చెందిన ప్రభుత్వ భూమిలో 20 గుంటల భూమిని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కేటాయించినట్లు వారు తెలిపారు. ఈ భూమిని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కబ్జా చేస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,900	వెండి (కిలో)	92,000
22 క్యారెట్స్	67,240	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	100
జీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	80	100	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	75	గోబిపువ్వు	60	80
వంకాయ	15	30	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	70	100	చామగడ్డ	40	60
కొత్తిమీర	70	100	గోరుచిక్కుడు	60	80
పుదీనా	60	90	చిక్కుడుకాయ	70	100
క్యాప్సికం	60	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	కల్కి–2898 ఏడీ(తెలుగు)–11.20, 2.55, 6.30, 10.05
స్క్రీన్-2	కల్కి–2898 ఏడీ (తెలుగు) – 10.00
స్క్రీన్-3	కల్కి–2898 ఏడీ (3డీ తెలుగు) – 11.50, 3.25,7.00, 10.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి–2898 ఏడీ(3డీ తెలుగు)–8.00, 11.45, 3.30,7.15, 11.00
స్క్రీన్-2	కల్కి–2898 ఏడీ(3డీ తెలుగు) – 10.45, 2.30, 6.15, 10.00 మహారాజ (తెలుగు) – 1.00, 7.45
స్క్రీన్-3	కల్కి–2898 ఏడీ (తెలుగు) – 5.40, 9.10, 12.40, 7.10, 10.40 మహారాజ(తెలుగు)– 4.10
స్క్రీన్ -4	కల్కి–2898 ఏడీ (తెలుగు) – 8.30, 12.15 కల్కి–2898 ఏడీ (హిందీ)– 6.45, 10.30 ముంజ్య (హిందీ)– 4.00
దేవి	కల్కి–2898 ఏడీ(తెలుగు)
నటరాజ్	కల్కి–2898 ఏడీ(తెలుగు)
విజయ్	కల్కి–2898 ఏడీ(తెలుగు)

బైపాస్ రోడ్డు బాగయ్యేదెన్నడు?

- సిరికొండలో కుంగిపోయి బీటలు వారిన సీసీ రహదారి
- పట్టించుకోని అధికారులు



రోడ్డు పునర్నిర్మాణ పనుల శిలాఫలకం



సిరికొండ మండలంలో గుంతలమయంగా మారిన బైపాస్ రోడ్డు



ధ్వంసమైన సీసీ రోడ్డు



అధ్వానంగా మారిన బైపాస్ రోడ్డు

సిరికొండ: మండల కేంద్రంలో గల బైపాస్ రోడ్డు అధ్వానంగా మారింది. మట్టి రోడ్డుగా ఉన్న బైపాస్ రోడ్డును పదేళ్ల క్రితం సీసీ రోడ్డుగా మార్చారు. ప్రస్తుతం సీసీ రోడ్డు కుంగిపోయి, బీటలు వారింది. రోడ్డుపై గుంతలు సైతం ఏర్పడడంతో మండల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా అధిక లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో పలు చోట్ల సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందుల్లో వాహనదారులు..

మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలో ఈ బైపాస్ రోడ్డు ఉంది. స్థానికులతో పాటు కొండూర్, పెద్దవాల్గోట్, పోత్నూర్ గ్రామాల ప్రజలు ఈ మార్గంలో మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఇరుగ్గా ఉండటంతో బైపాస్ రోడ్డు ద్వారా నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ధర్పల్లి, డిచ్‌పల్లితో పాటు జిల్లా కేంద్రం వైపు వెళ్లే వారు ఈ మార్గంలో వెళుతుంటారు. కానీ బైపాస్ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులు మంజూరైనా..

బైపాస్ రోడ్డులో తారు రోడ్డు పునర్నిర్మాణ పనులకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా గత ఏడాది రూ.యాభై లక్షల నిధులు మంజూరయ్యాయి. గత ఏడాది సెప్టెంబర్ 13న రోడ్డు నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శంకుస్థాపన చేశారు. కానీ అంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో పాత ప్రభుత్వంలో మంజూరైన నిధులపై సందిగ్ధత నెలకొంది. నిధులు మంజూరై పది నెలలు కావస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును త్వరగా బాగు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డును బాగుచేయించాలి..



మండల కేంద్రంలో గల బైపాస్ రోడ్డు బాగా ధ్వంసమైంది. అధ్వానంగా మారిన బైపాస్ రోడ్డుతో మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. తారు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో పది నెలల క్రితం శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును త్వరగా బాగు చేయించాలి.

– తాళ్ల శ్రీనివాస్, బీజేపీ నాయకులు, సిరికొండ

త్వరలో పనులు చేపడతాం..

సిరికొండ బైపాస్ రోడ్డును తారు రోడ్డుగా మార్చడానికి గతంలోనే నిధులు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ కారణంగా రోడ్డు పనుల ప్రారంభంలో జాప్యం జరిగింది. మంజూరైన నిధులతో త్వరలోనే పనులు ప్రారంభించి, రోడ్డును బాగుచేయిస్తాం.

–హైమద్ హుస్సేన్, పంచాయతీరాజ్ ఏఈ

నూతన కార్యవర్గం ఎన్నిక

బాల్కొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ ముప్కాల్ నూతన కార్యవర్గాన్ని ముప్కాల్ మండల కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ముల శ్రీనివాస్, కార్యదర్శిగా జక్కుల శ్రీనివాస్, కోశాధికారిగా గడ్డం సురేశ్‌రెడ్డి ఎన్నికయ్యారు. అలాగే ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.